# రామరాజ్యం అంటే

# రాముడు ఎందుకు ఆదర్శం..?



రామాయణ మహా కావ్యానికి... మానవ జీవితంతో విడదీయరాని సంబంధం ఉంది. రాముడు పరిపూర్ణ మానవుడు. మనిషి ఎలా ఉంటాడో అలాగే జన్మించాడు... మన లాగే పెరిగాడు... మన లాగే కష్టాలు పడ్డాడు... లోకం నుంచి నిష్టూరాలు కూడా అందుకున్నాడు... ఎన్ని కష్టాలు వచ్చినా... ఏ సందర్భంలోనూ శ్రీరామచంద్రుడు ధర్మాన్ని తప్పలేదు. తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడ్డాడు. ఆదర్శ- పుత్రుడు, ఆదర్శ శిష్యుడు, ఆదర్శ భర్త... ఆదర్శ- సోదరుడు, ఆదర్శ- స్నేహితుడు, ఆదర్శ రాజు... ఇలా అన్నీ తానే అయ్యాడు. మానవ జీవితానికి అతి దగ్గరగా మెలిగింది శ్రీరామావతారం. అందుకే "రామ" నామం వింటే హిందువులు రోమరోమానా పులకించిపోతారు. సాటి వారిపై గౌరవం, తోటివారి అభిప్రాయాలకు విలువ ఇవ్వడం రాముడిలోని గొప్పతనం. తన అన్న రావణుడితో విభేదించి... శ్రీరాముడిని శరణు కోరతాడు విభీషణుడు. కానీ రాముడు నేరుగా అభయం ఇవ్వడు. జాంబవంతుడు, సుగ్రీవుడు, అంగదుడు, ఆంజనేయుడు. శరభుడు లాంటి వారిని పేరు పేరునా అభిప్రాయం కోరతాడు. తన మాట నెగ్గాలని ఎప్పుడూ రాముడు అనుకోలేదు. ప్రతి విషయంలో ప్రజాభిప్రాయాన్ని మన్నించే సుగుణం రాముడి సొంతం.

### రాజ ధర్మం ముఖ్యం

రాజుగా ప్రజా జీవితంలోకి ఉండే వారికి ఎలాంటి కళంకం ఉండకూడదు అని సీతమ్మతో అగ్నిప్రవేశం చేయిస్తాడు. కిష్కింద, లంక రాజులను ఓడించాడు రాముడు. అయినా ఆ రాజ్యాలం కోసం ఆశపడ లేదు. మిత్రులకు ఇచ్చిన మాట నిలబెట్టడం కోసం... కిష్కిందను సుగ్రీవుడికీ, లంకను విభీషణుడికి అప్పగించాడు. రాజ్యకాంక్ష, పరుల సొమ్ము పై వ్యామోహం లాంటి చెడ్డ లక్షణాలు మనిషికి ఉండకూడదని ఆచరించి చూపాడు. మాటపై నిలబడటం ఆయనలోని అద్భుత లక్షణం. తండ్రి మాట నిలబెట్టేందుకు అడవులకు వెళతాడు... పితృవాక్య పాలనే శిరోధార్యమని నమ్ముతాడు. మరికొన్ని గంటల్లో రాజుగా పగ్గాలు చేపట్టే సమయంలో... తనను అడవులకు పంపారని పరనింద చేయలేదు. అంతేకాదు... కైకేయిని జాగ్రత్తగా చూసుకొమ్మని చెబుతాడు. శ్రీరాముడు సత్యవాక్పాలకుడు. తాను గొప్ప వీరుడైనా శాంతిని కోరుకున్నాడు. హనుమంతుడిని రావణుడి దగ్గరకు దూతగా పంపాడే తప్ప... ముందే యుద్ధానికి కాలు దువ్వలేదు.

### ఉపకారం మర్చిపోవద్దు

మనకు ఉపకారం చేసినవారికి అపకారం తలపెట్టడం మహాపాపమని రామాయణం చెబుతుంది. ఎలాంటి పాపానికైనా ప్రాయశ్చిత్తం ఉంటుంది... కానీ కృతఘ్నతకు లేదని చెబుతాడు రాముడు. లంకు వెళ్ళే వంతెన నిర్మాణంలో సాయపడిన ఉడుత దగ్గర నుంచి రావణుడి చేతిలో చనిపోయిన జటాయువు దాకా కృతజ్ఞతను చాటాడు శ్రీరాముడు. జటాయువు తన కోసం చనిపోయిందని బాధపడతాడు. యుద్ధంలో సుగ్రీవుడు గాయపడితే... అయ్యో తన వల్లే మిత్రుడు గాయపడ్డాడని దుఃఖిస్తాడు. రావణ సంహార ఘట్టం పూర్తయ్యాక... దేవేంద్రుడు వరం కోరుకొమ్మని అడిగితే... తన కోసం యుద్ధంలో చనిపోయిన వానరులను బతికించమని అడుగుతాడు. సీతమ్మ జాడ కనిపెట్టడాన్ని స్వామికార్యంగా ఆంజనేయుడు భావిస్తాడు. కానీ అది మహోపకారం అంటూ రాముడు గాఢాలింగనం చేసుకుంటాడు.

### ధర్మాచరణ

ధర్మాచరణలో రాముడు తమ, పర భేదాలు చూపించలేదు. సీతమ్మను ఉద్దేశించి అయోధ్య వాసి తప్పుగా మాట్లాడితే... ఆమెను వాల్మీకి ఆశ్రమానికి పంతున్నప్పుడు...... సీత నా ప్రాణం... సీతకన్నా, నా ప్రాణంకన్నా సోదరుడికన్నా అన్నింటికన్నా ధర్మం... వంశగౌరవం గొప్పవి' అని లక్ష్మణుడితో అంటాడు.

### ఆదర్శ రాముడు

రాజధర్మం విషయంలో రాముడు ఆదర్శమూర్తి. అందుకే రామరాజ్యాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుంటాం. వనవాసానికి వెళ్ళిపోయిన రాముడిని వెతుకుతూ వెళ్ళిన భరతుడికి,... రాజ్యపాలన, రాజధార్మాల గురించి చెబుతాడు. ధర్మోపదేశం చేస్తాడు. పాలకుడు గురువులను, రాజనీతిజ్ఞులను ఆదరించాలి. రాజుకు వ్యక్తిగత క్రమశిక్షణ చాలా అవసరం. బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేవాలి... అప్పుడే కాలం సద్వినియోగం అవుతుంది. చక్రవర్తికి కళ్ళూ చెవులూ మంత్రులు. వాళ్ళల్లో అసమర్థుల్ని పెట్టుకుంటే... రాజు తన కన్ను తాను పొడుచుకున్నట్టే అని చెబుతాడు. న్యాయవ్యవస్థ బలంగా ఉంటేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. శాంతి భద్రతలు లేకపోతే... జనం ప్రభువును గౌరవించరు. జనం భరించలేనంతగా పన్నులు ఉండకూడదు. ప్రజలకు ఇచ్చిన మాట తప్పకూడదు.

అబద్దాలు ఆడరాదు. పొగడ్తలకు పొంగిపోకూడదు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. నేను రాజుని అని అహం ఉండొద్దు. ఎప్పుడు చేయాల్సిన పని అప్పుడే చేయాలి. అపరాధులను నేరం రుజువయ్యాకే శిక్షించాలి. రాజు, మంత్రులు, సేనాధిపతులు, ఉద్యోగులంతా ధర్మబద్ధంగా ఉండాలి. వాళ్ళ సక్రమంగా ఉంటేనే జనం కూడా సత్యమార్గంలో నడుస్తారు. ఇలా రాముడు తమ్ముడైన భరతుడికి చెప్పడమే కాదు... అయోధ్య పట్టాభిషేకం తర్వాత ఆచరించి చూపాడు. అందుకే రాముడు అప్పటికీ... ఇప్పటికీ... ఆదర్శ ప్రాయుడు అయ్యాడు.

( - మేడుకొండూరు విష్ణుకుమార్, సీనియర్ జర్నలిస్ట్ )

## భద్రాచలంలో కల్యాణం ఏర్పాట్లు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :** దక్షిణ అయోధ్యగా భావించే భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశారు. వీధుల్లో శ్రీరాముడి కల్యాణ శోభ తోరణాలతో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఎండలు మండిపోతుండటంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చలువ పందిళ్ళు, విద్యుత్ దీపాల కాంతులతో అలంకరించారు. ఆదివారం ఉదయం అభిజిత్ లగ్న ముహూర్తంలో సీతారామ చంద్రస్వాముల వారి కల్యాణ వేడుక అత్యంత వైభవంగా జరగనుంది. ఈ కల్యాణోత్సవంలో సీతా రాముల వారికి రాష్ట్ర ప్రభుత్వం ముత్యాల తలంబ్రాలు సమర్పించనుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించనున్నారు. భద్రాచలంలో జరిగే కల్యాణ వేడుకలను చూసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటితో పాటు సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, భారీగా తరలి వస్తుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### ఏపీ డిప్యూటీ సీఎం పర్యటన రద్దు

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భద్రాచలం పర్యటన రద్దయింది. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం భద్రాచలంలో సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొనాలని మొదట పవన్ కల్యాణ్ నిర్ణయించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు తన ఇంటి నుంచి బయల్దేరి రాత్రికి భద్రాచలం చేరుకునేలా షెడ్యూల్ రెడీ అయింది. అటు ఏపీ ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలను స్వామి వారికి సమర్పించాలని కూడా పవన్ కల్యాణ్ అనుకున్నారు. అయితే భద్రాచలం కల్యాణానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు. తన పర్యటనతో భక్తులకు ఇబ్బంది తలెత్తే అవకాశం ఉండటంతో పవన్ టూర్ రద్దు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై తెలంగాణ ప్రభుత్వానికి కూడా సమాచారం ఇచ్చినట్టు ఏపీ ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి.

### ఒంటి మిట్టలో ఈనెల 11న కల్యాణం

ఆంధ్రప్రదేశ్ లోని ఒంటి మిట్ట కోదండ రామాలయంలో ఈనెల 11న శ్రీ సీతారాముల వారి కల్యాణం జరగనుంది. టీటీడీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయి. ఇప్పటికే ఈనెల 5 నుంచి 15 వరకూ ఒంటి మిట్ట రామాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజలు, రోజుకొక అలంకారంలో రామయ్య తండ్రి భక్తులకు దర్శనం ఇస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆలయం నిర్వహణ బాధ్యతలను టీటీడీ చేపట్టింది. ఒంటి మెట్ట మీద నిర్మించిన ఆలయం ఉన్న ప్రాంతం కాబట్టే ఒంటి మిట్ట అయింది. ఒకే శిలలో సీతా రామలక్ష్మణుల విగ్రహాలు నిర్మితమై ఉన్నాయి. ఒకే శిలలో ముమ్మూర్తులు నిలిచి ఉన్న ఆలయం ఇదొక్కటే అని భక్తులు చెబుతారు.



## శ్రీరామ నామం చాలు...!



వాల్మీకి రామాయణం ప్రకారం శ్రీరామచంద్రుడు చైత్ర మాసంలో జన్మించారు. ఆయన జన్మించిన శుక్లపక్ష నవమి తిథిని శ్రీరామ నవమి మహోత్సవంగా నిర్వహిస్తారు. భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు చెప్పినట్టు... దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ... ధర్మ సంస్థాపనకు భగవంతుడు యుగ యుగాన అవతరిస్తాడు. మనుషులకు భగవంతుడిని శరణు పొందే మార్గాన్ని సూచిస్తారు. శ్రీరామచంద్రుడి అవతారం కూడా ఇలాంటిదే. ఆయన్ని శరణు వేడిన వారికి అభయం ఇస్తాడు. భగవంతుడి అవతారం అంటే స్వర్గం నుంచి ఈ భూలోకానికి రావడమే. అయితే రామ నామాన్ని జపిస్తే చాలు... ఆ దేవ దేవుడి అభయం లభిస్తుంది. శ్రీ రామచంద్రుడు ఇప్పటికీ తన నామ రూపంలో ఈ లోకంలోనే ఉన్నాడు. రాముడే కాదు... రామ నామం వినిపించిన చోట ఆయన ప్రియ భక్తుడు ఆంజనేయ స్వామి కూడా అక్కడే ఉంటారు. మానవ జన్మలు కర్మఫలతం ప్రకారం ఉంటాయి. కానీ భగవంతుడి అవతరణ ఆయన సంకల్పంతోనే జరుగుతుంది. అయితే రాముడు త్రేతా యుగంలో మాత్రమే ఉన్నాడని అనుకుంటే పొరపాటు. ఆయన అన్ని కాలాల్లోనూ సర్వజీవులకు అందుబాటులో ఉంటాడు. అది కూడా రామ నామం రూపంలో. శ్రీరామ నామమే రక్ష... : "ఎవరైనా నన్ను ఒక్కసారైనా శరణువేడి... స్వామీ! ఈ రోజు నుంచి నేను నీ వాడను అంటూ... నాకు అభయం ఇవ్వమని ప్రార్థిస్తే, అట్టివానికి ఆ క్షణం నుంచే అభయం ఇచ్చి సర్వదా వాళ్ళని సంరక్షిస్తాను అని రాముడే స్వయంగా చెబుతాడు. రామాయణంలోనూ ఇదే పాటించాడు. రావణాసురుని నుంచి రక్షించాలని దేవతలు అడిగితే భూమ్మీదకు రామావతారంలో వస్తాడు ఆ శ్రీమన్నారాయణుడు. సుగ్రీవుడు, విభీషనుడికి మాట ఇచ్చి దాన్ని నెరవేర్చాడు. అలాంటి పుణ్యాత్ముడు శ్రీరామచంద్రుడిని చేరుకోవటానికి ఉత్తమమైన మార్గం... ఆయన జపం మాత్రమే. భగవన్నామానికి...భగవంతునికి మధ్య లాంటి తేడా లేదని పద్మపురాణం చెబుతుంది. రామనామాన్ని జపించేవారికి ఆ నామమే అభయం ఇస్తుంది. శ్రీరామచంద్ర ప్రభువు ఇప్పటికీ తన నామ రూపంలో ఈ లోకంలోనే ఉన్నాడు.

